క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలీలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

గన్నేరువరం: గన్నేరువరం మండల పద్మశాలీ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కరీంనగర్‌లో ఆయన స్వగృహంలో కలిశారు. ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బూర శ్రీనివాస్, అక్షర మీ సేవా నిర్వాహకులు తీల్ల రవీందర్, రాజమల్లు, సభ్యులు పాల్గొన్నారు.

కళా నైపుణ్యం ప్రదర్శించాలి

రామడుగు: ఈ నెల 29న జరిగే జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో యువత తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు ఒక ప్రకటనలో కోరారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతకు వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఎనిమిది అంశాల్లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

బియ్యం అందజేత



బియ్యం, నగదు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

గన్నేరువరం: మండల కేంద్రానికి చెందిన రంగనవేని పోశయ్య, న్యాత మల్లవ్వ, రాములు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను నందికొండ తిరుపతిరెడ్డి ట్రస్టు వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నందికొండ తిరుపతిరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నగదు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, బుర్ర తిరుపతిగౌడ్, న్యాత జీవన్, మీసం రాములు, సత్యనారాయణ, కార్యకర్తల పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి



క్రికెట్ కిట్లు అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

గన్నేరువరం: మండలంలోని చీమలకుంటపల్లె గ్రామ యూత్ సభ్యులకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం క్రికెట్ కిట్లు అందజేశారు. యువత క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బామండ్ల ఆంజనేయులు, సీనియర్ నాయకులు బామండ్ల తిరుపతి, తుమ్మ చందు, ప్రభాకర్, రాజేందర్, వజ్ర నరేశ్, గాదె రాజు, పాలవేని మల్లేశం, అరుకుల శ్యామ్, బామండ్ల చందు, పకిడే వీరేశం పాల్గొన్నారు.

చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ప్రభాకర్

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ క్రిస్మస్ పురస్కరించుకొని ఆదివారం వృద్ధులు, వితంతువులకు పట్టుచీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాల రాజు, కానుగంటి శ్రీకాంత్, నాంపల్లి రవీందర్, సతీశ్ పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న వడ్లకొండ సంపత్

జమ్మికుంట: తాటిచెట్టు పైనుంచి పడటంతో గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి.. గౌడ కులస్తులు తెలిపిన వివరాలు... మున్సిపల్ పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ సంపత్ ఆదివారం తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి కింద పడిపోయాడు. చుట్టుపక్కల ఉన్న గీత కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు ఆసుపత్రికి తరలించారు. సంపత్ కుటుంబాన్ని ఆదుకోవాలని సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ కోరారు.

నిర్మించిన రెండేళ్లకే..

- రెండుసార్లు కొట్టుకుపోయిన చెక్‌డ్యాం
- కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా
- చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలని రైతుల డిమాండ్



తూతూమంత్రంగా నిర్మించిన చెక్ డ్యామ్



భారీ వర్షానికి కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్

ఇల్లందకుంట: సాగు, తాగునీటి కోసం మండలంలోని మల్యాల గ్రామ పరిధి వాగుపై గత ప్రభుత్వం నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. ఇందులో మల్యాల, పాతర్లపల్లి గ్రామాల శివారు మధ్య నిర్మించిన చెక్ డ్యాం నిర్మించిన రెండేళ్లలోనే రెండుసార్లు వరదలకు కొట్టుకుపోయింది. కాంట్రాక్టర్ పర్సంటేజీలకు ఆశపడి ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై నామమాత్రంగా నిర్మించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాసిరకంగా నిర్మించినా పర్యవేక్షణ లేకపోవడం నీటిపారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని రైతులు విమర్శిస్తున్నారు.

చెక్ డ్యాం నిర్మించొద్దని..

చెక్‌డ్యాం నిర్మాణం చేపడితే ఆ ప్రాంతంలో ఉన్న వందల ఎకరాలకు వెళ్లేందుకు దారి ఉండదని, బ్యాక్‌వాటర్‌తో వాగు దాటడం ఇబ్బందికరంగా ఉంటుందని గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు మల్యాల గ్రామస్తులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా వినలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పైనుంచి వచ్చే వరద ప్రవాహాన్ని అంచనా వేయకుండా నిర్మించడంతో రెండుసార్లు డ్యాం కట్ట తెగిపోయిందని వాపోయారు.

నిధులు నీళ్లపాలు

అధికారుల పర్యవేక్షణ లేకుండా, కాంట్రాక్టర్ నాణ్యత లోపంతో చెక్‌డ్యాం నిర్మించి చేతులు దులుపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రూ.1.10 కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్ డ్యాం నిధులు నీటి పాలయ్యాయి. మల్యాల, పాతర్లపల్లి గ్రామాల మధ్య నిర్మించిన చెక్ డ్యాంను 2021లో నిర్మించగా, అదే ఏడాది కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి వరద ప్రవాహం రావడంతో తెగిపోయింది. తిరిగి ఈ ఏడాది జూన్‌లో చెక్ డ్యాంకు మరమ్మతులు చేశారు. కానీ, జూలై చివరి వారంలో కురిసిన భారీ వర్షానికి డ్యాంకు గండి పడి రెండోసారి కొట్టుకుపోయింది. అలాగే సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించే ప్రాంతానికి పక్కన డ్యాం నిర్మించడంతో పంటలు మునగగా, అధికారులు డ్యాం ఎత్తును సుమారు 2 ఫీట్ల వరకు కూల్చివేశారు. దీంతో డ్యాంలో నీరు నిల్వ లేకుండా పోయి ప్రజాధనం వృథా అయ్యిందని రైతులు, ఆయా గ్రామస్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత లోపించింది



చెక్ డ్యాం నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించింది. నిర్మించిన రెండేళ్లలో రెండు సార్లు కొట్టుకుపోవడానికి ప్రధాన కారణం కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కు కావడమే. చెక్ డ్యాం నిర్మాణంలో ఇంజినీర్ల వైఫల్యం స్పష్టంగా కనబడుతుంది. వరద ప్రవాహ ఒత్తిడిని అంచనా వేయడంలో విఫలమయ్యారు.

– మాదారపు రత్నాకర్, సామాజిక కార్యకర్త

ఫిర్యాదు చేసినా పట్టించుకోలే



మల్యాల పరిధిలో నిర్మించిన పలు చెక్ డ్యామ్‌ల పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, అధికారుల పర్యవేక్షణ లేకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేపట్టారని ఆరోపిస్తూ గత జూలై 4న ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన. ఇప్పటి వరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి. గండిపడిన చెక్ డ్యాంకు వెంటనే మరమ్మతు చేపట్టాలి.

– గురుకుంట్ల మధుకర్, మల్యాల

వేడుకల్లో హద్దు మీరొద్దు



హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై

తిమ్మాపూర్: నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని హద్దు మీరితే చర్యలు తప్పవని ఎల్ఎండీ ఎస్సై శీలం ప్రమోద్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 31న రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, రాత్రిపూట బయట తిరగకుండా చూసుకోవాలని సూచించారు. కొత్త సంవత్సరానికి ఎన్నో ఆశలు, ఆశయాలు, లక్ష్యాలతో సంతోషంగా స్వాగతం పలుకుతూ యువత, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు వేడుకలు జరుపుకోవాలన్నారు.

నియామకం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న డీలర్లు

శంకరపట్నం: మండల కేంద్రంలో రేషన్‌డీలర్ల యూనియన్ మండల అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భూమయ్య, కోశాధికారిగా బి.పద్మ, ప్రచార కార్యదర్శిగా శోభహరీశ్, ఉపాధ్యక్షులుగా ఎం. మహిపాల్‌రెడ్డి, రమాదేవి ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో డీలర్లు ఎస్.కోమల, రాజు, అంజలి, ప్రేమలత, మమత, శ్రీనివాస్ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని డీలర్లు సన్మానించారు.

ఆక్రమణకు గురవుతున్నా పట్టింపు కరువు



విగ్రహం వెనుక ఇసుకతో నిండుకున్న స్థలం

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ బస్టాండ్ చౌరస్తా (దర్గా) వద్ద జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వెనుక స్థలం ఆక్రమణకు గురవుతోంది. ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే ఇసుకను విగ్రహం వెనకాల పోస్తున్నారు. దర్గాకు చుట్టుపక్కల నివాసం ఉండే కొందరు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విగ్రహానికి పదేళ్ల క్రితం వేసిన రంగు వేశారని, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్ముడి విగ్రహాన్ని గ్రామపంచాయతీ పాలక వర్గం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవైపు కలరింగు లేక విగ్రహం బోసిపోతుండగా, మరోవైపు విగ్రహం వెనుక ఖాళీ స్థలం ఇసుక, ఇతర వస్తువులతో నిండుకుంటోంది. అధికారుల ఉదాసీనత, పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత, అధికారులు, నాయకులు స్థలాన్ని పరిరక్షించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న రవి, తదితరులు

హుజూరాబాద్: హుజూరాబాద్ మాధవ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఎర్ర నాగరాజు ఇటీవల మృతి చెందాడు. ఆయన భార్య రేణుకకు ఆదివారం సామూహిక నిధి నుంచి రూ. 33,430 సంఘం కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు రవి మాట్లాడుతూ... సభ్యులు తప్పనిసరిగా సామూహిక నిధి సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కార్తిక్, సభ్యులు పసుల స్వామి, అశోక్, మామునూరి ప్రవీణ్ , ముప్పురాజు, కొలిపాక భరత్, గణకులు ప్రతాప మహేశ్ పాల్గొన్నారు.

సిగ్నల్స్ ప్రారంభం



ఎన్ఆర్ఐని సన్మానిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

సైదాపూర్: మండలంలోని దుద్దనపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కామినేని రాజేశ్వర్‌రావు తల్లిదండ్రులు శోభారాణి, జనార్దన్‌రావుల జ్ఞాపకార్థం, సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం చొరవతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా సోలార్ బ్లింకర్స్‌ను ఏర్పాటు చేయగా ఆదివారం ఏసీపీ జీవన్‌రెడ్డి ప్రారంభించారు. సైదాపూర్, దుద్దెనపల్లి రోడ్డు మార్గంలో రెండు ప్రమాద హెచ్చరిక సోలార్ సిగ్నల్ బోర్డులు, రోడ్డు మూలమలుపుల వద్ద 24 సోలార్ సిగ్నల్ బ్లింకర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ... సొంత ఖర్చులతో ప్రమాదక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రాజేశ్వర్‌రావును శాలువతో సన్మానించారు. ప్రజాసేవలో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సంతోశ్‌కుమార్, ఎస్సై ఆరోగ్యం, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విరాళాలు అందజేత



విరాళాలు అందిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే పిలుపు మేరకు ఆదివారం దేశం కోసం దానం (డొనేట్ ఫర్ దేశ్)పేరిట నాయకులు విరాళాలు అందజేశారు. ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విరాళాల సేకరణ చేపడుతున్నామన్నారు. పార్టీ అభిమానులు కాంగ్రెస్ వెబ్ సైట్ ద్వారా విరాళం అందజేయాని కోరారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రభుదాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేశ్, మాజీ సర్పంచ్ కొంరయ్య, నాయకులు రవీందర్, ఎండీ చాంద్‌పాషా, సాగర్, నవీన్, సతీశ్, సదయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఇసుక రవాణా అరికట్టాలి

వీణవంక: నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక రవాణాను నిలిపివేయాలని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అధికారులను కోరారు. మండలంలోని ఇసుక రీచ్‌లను ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... టీఎస్ఎండీసీలో ఓ మహిళా ఉన్నతాధికారి అక్రమాలకు పాల్పడుతోందని, గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం కేవలం ఉన్న స్టాక్ మాత్రమే అమ్ముకోవాలని, ఇసుక తవ్వకాలు చేపట్టొద్దని తీర్పు ఇచ్చిందని, కానీ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిందాల అంజన్న, సంది సురేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజ్‌కుమార్, సలీం, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎంపీ ఎన్నికల్లో గెలుపొందాలి

చొప్పదండి: వచ్చే ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. మండలంలోని గుమ్లాపూర్ గుట్ట వద్ద గల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా బండి సంజయ్ ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. వెంట మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, ఎంపీపీ రవీందర్, ర వీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'రసమయి జోలికి రావొద్దు'



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

తిమ్మాపూర్: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జోలికి వస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ అన్నారు. తిమ్మాపూర్ మండలం పోలీస్ స్టేషన్ ఎదుట రాజీవ్ రహదారిపై ఆదివారం ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు నుంచి వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వ పథకాలు అమలు చేసే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సుభాష్‌నగర్ స్టేజీ వద్ద ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ రెడ్డి, అనిల్ గౌడ్, తిరుపతి, శంకర్, వీరారెడ్డి, రవీందర్, కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, మల్లయ్య, జలపతి, తిరుపతి, ఆంజనేయులు, కృష్ణ, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ముందుగా సంఘం 17వ వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా వంగాల విజేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కొత్త తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్నం చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా వంగల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వంగల శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శడిగా వంగల రాజిరెడ్డి, కార్యవర్గ, సలహా సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని కార్యవర్గం సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పెరియర్ రామస్వామి వర్ధంతి

హుజూరాబాద్: పట్టణంలో ఆదివారం నాస్తిక ఉద్యమ పితామహుడు, మానవతావాది, సంఘసంస్కర్త, ద్రవిడ ఉద్యమ నాయకుడు, హేతువాది పెరియర్ ఈవీ రామస్వామి వర్ధంతి నిర్వహించారు. మానవ వికాస వేదిక నాయకులు రొంటాల బుచ్చయ్య పెరియర్ రామస్వామి చిత్రపటం వద్ద పూలు వేసి మౌనం పాటించారు. రామస్వామి దేశ ప్రజలకు అందించిన సంఘ సంస్కరణలను స్మరించుకున్నారు. ప్రజలు పెరియర్ ఈవీ రామస్వామిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

మట్టితీత పనులు ప్రారంభం



గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామ చెరువులో ఎట్టకేలకు మట్టి తీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. పనులను చిన్న నీటిపారుదలశాఖ ఏఈ రాజ్‌కుమార్ పరిశీలించారు. చెరువులో గతేడాది ఓ ఆలయ నిర్మాణానికి కొందరు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మరి కొందరు చెరువును ఆక్రమించి ఆలయ నిర్మాణం చేపడుతున్నారని, చెరువు శిఖం కాపావాలని కలెక్టర్‌తో పాటు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ధర్నాలు చేపట్టారు, కో ర్టును ఆశ్రయించారు. దీనిపై కొద్దికాలంగా ఇరువర్గాల మధ్య గ్రామంలో వివాదం కొనసాగుతోంది. ఇటీవల మండల పరిషత్ సమావేశంలో సమస్యపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించారు. చెరువును ఆక్రమించి పోసిన మట్టిపై అధికారులతో సమీక్షా నిర్వహించారు. నిరసన, సమీక్షల అనంతరం అధికారులు చెరువులో మట్టి తీత పనులను ప్రారంభించారు. మట్టి అవసరం ఉన్న రైతులు తమ పొలాల్లోకి వివిధ వాహనాల్లో తీసుకెళ్తున్నారు. చెరువు శిఖంపై నెలకొన్న వివాదం సద్దుమణుగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 51 వేల విరాళం



చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ గుర్రం ఆనందరెడ్డి, సోదరుడు గుర్రం విజయభాస్కర్ రెడ్డి ఆదివారం రూ. 51 వేల విరాళం అందించారు. అమెరికా నుంచి నిధులు పంపించగా చొప్పదండి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదేశాల ఈ మేరకు ఆలయ కమిటీ నిర్వాహకులకు నగదు అందించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని దాతల సాయంతో ఆలయం అభివృద్ధి పనులకు తన వతు సహకారం అందిస్తున్నట్లు చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర

జమ్మికుంట: పట్టణంలో మండల పూజా మహోత్సవంలో భాగంగా అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి శోభాయాత్ర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని రథంపై పురవీధుల గుండా మేళతాళాలు, స్వాములు, భక్తుల నృత్యాల మధ్య ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. గురుస్వాములు ప్రతాప్‌రెడ్డి, మనోహర్‌స్వామి, రాజేంద్రప్రసాద్, స్వాములు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట పాఠశాల 2012–13 పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, యోగక్షేమాలు తెలుసుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కర్ర రాజిరెడ్డి, మల్లేశం, దామోదర్, మూర్తి, శశికళ, శోభారాణి, కృష్ణమాలతిని ఘనంగా సన్మానించారు.